



జిల్లాలో రహదారులు, సాగునీటి కాలువలు కొత్త రూపును సంతరించుకోనున్నాయి. కూటమి ప్రభుత్వ ప్రాధాన్యాలతో వాటి దశ మారనుంది. ఇప్పటికే అనేక రహదారులకు చురుగ్గా మరమ్మతులు జరుగుతున్నాయి. వచ్చే సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులు ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని నిధులు మంజూరు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా రూ 23.51 కోట్లతో రోడ్ల మరమ్మతులు సాగుతున్నాయి. ఇక సాగునీటి కాలువలకు కూడా కొత్త రోజులు వచ్చాయి. ఐదేళ్ల వైసీపీ హయాంలో కాలువల్లో పూడిక తీయలేదు. కనీసం జంగిల్ క్లియరెన్స్ చేయలేదు. దీంతో అవి అధ్వానంగా తయారయ్యాయి. నీటి ప్రవాహానికి ఏమాత్రం అనుకూలంగా లేవు. శివారు ఆయకట్టుకు నీరందే పరిస్థితే లేదు. వాటి దుస్థితి చూసిన కూటమి ప్రభుత్వ నేతలు ప్రక్షాళనకు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 55 పనులకు రూ.3.34 కోట్లు మంజూరు చేశారు. దాదాపు టెండర్లు పూర్తయ్యాయి.

కొత్త రూపు

- గుంతల రహదారులకు చురుగ్గా మరమ్మతులు
- జిల్లా వ్యాప్తంగా 750 కిలోమీటర్ల పరిధిలో పనులు
- పంట కాలువల ఆధునికీకరణకు రూ.3.34 కోట్లు మంజూరు
- పూర్తయిన టెండర్లు



రహదారిపై గుంతలు పూడ్చుతున్న దృశ్యం

తీరనున్న దారి కష్టాలు

- రూ.23.51 కోట్లతో రోడ్లకు మరమ్మతులు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుంతల రహదారుల్లో కష్టాలు తీరనున్నాయి. వాటిని బాగు చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. అందులో భాగంగా తక్షణం మరమ్మతులు చేపడుతోంది. ఐదు సంవత్సరాల వైసీపీ హయాంలో రహదారులు పూర్తిగా గాడితప్పాయి. రూపు మారాయి. నడవడానికీ ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ గోతులు పడినా బాగు చేయకపోవడం వల్ల వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన నాయకులు గుంతలు పూడ్చుతూ భారీ ఎత్తున నిరసన తెలిపారు. జిల్లాలో చాలా రోడ్లు దారుణంగా తయారయ్యాయి.

విశాఖపట్నం నుంచి రాయపూర్ వరకూ నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కోసం జిల్లాలోని కొత్తవలస, జామి, గంట్యాడ, బొండపల్లి, గజపతినగరం, మెంటాడ మండలాల్లోని పలు గ్రామాల్లో చెరువులు, వివిధ స్థలాల నుంచి గ్రావెల్ తీసుకువెళ్లారు. సుమారు 30 టన్నుల మట్టితో లారీలు గ్రామాల రహదారులపై తీసుకువెళ్లడంతో ఆయా రోడ్లు అత్యంత దారుణంగా మారాయి. భారీ గోతులతో నిండిపోయాయి. వైవే అధికారులు కూడా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా రహదారులకు పూర్వ దశ రానుంది. జిల్లాలో రెండు విడతలుగా 176 పనులకు రూ.23.51 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో 750 కిలోమీటర్ల పొడవునా గుంతలను ఆర్అండ్‌బి అధికారులు పూడ్చనున్నారు. మొదటి విడతగా 68 పనులకు రూ. 10.54 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు ద్వారా రూ 296.71 కిలో మీటర్ల పరిధిలో రోడ్లకు మరమ్మతులు చేపట్టనున్నారు. మొదటి విడత పనుల్లో ఇప్పటికే 61 టెండర్లు ఖరారైపోయాయి. 28 పనులు ప్రారంభించి దాదాపు 50 కిలోమీటర్ల నిడివి గల రోడ్లలో మరమ్మతులు కూడా పూర్తి చేశారు. మిగిలిన 7 పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నారు. రెండో విడతలో ఈనెల 15న 108 పనులకు రూ.12.97 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

గడువులోగా పనులు పూర్తి: కలెక్టర్ అంబేడ్కర్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గుంతలు లేని రహదారులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తాం. అందుకు సంబంధించి అన్ని చర్యలు చేపట్టాం. పనులు వేగవంతంగా చేసేలా అధికారులకు సూచించాం. ఎప్పటికప్పుడు పురోగతిపై సమీక్షిస్తున్నాం.

మారనున్న కాలువలు

- ఆధునికీకరణకు నిధులు

నెల్లిమర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షాలు పడ్డాయి. జలాశయాల్లో నీరు చేరింది. నీటి స్థిరీకరణ కూడా ఉంది కానీ జలాశయాల నుంచి నీరు వెళ్లే కాలువల తీరు దయనీయంగా మారింది. కాలువల నుంచి నీరు మళ్లించే మదుములు, చప్టాలు పూర్తిగా పాడయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వీటికి కొత్త రోజులు వచ్చినట్లయింది. కాలువల పరిస్థితిని పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ మేరకు అందిన నివేదికల ప్రకారం మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. దీంతో రబీ నాటికి సాగునీటి వనరులు కొత్త రూపును సంతరించుకోనున్నాయి.

జిల్లాలో మొత్తం 55 పనులకు మోక్షం కలిగింది. మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి రూ.2.95 కోట్లు, చిన్ననీటి వనరులకు సంబంధించి రూ.39.50 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే 22 పనులకు సంబంధించి టెండర్లు ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ప్రధానంగా వెంగళరాయసాగర్ పరిధిలోని పనులకు టెండర్లు పూర్తిచేసినట్టు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చంపావతి నది నుంచి ఎస్ఎస్ఎస్ ఆర్ పేట వద్ద ఉన్న డైవర్షన్ చానల్ (కుమిలి కాలువ) పూడిక, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీంతో చంపావతిలోని సర్‌ప్లస్ వాటర్ కూడా ఈ కాలువ గుండా ప్రవహించే పరిస్థితి లేదు. ఫలితంగా కాలువపై ఆధారపడిన డెంకాడ, భోగాపురం మండలాల సాగు భూములు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి.



పూడికతో ఉన్న కుమిలి పంట కాలువ



సందడే సందడి

కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో చింతపల్లి బీచ్ జనసంద్రమైంది. 10వేల మందికిపైగా పర్యాటకులు సముద్రతీరానికి వచ్చి కేరింతలు కొట్టారు. కుటుంబసమేతంగా స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ దుర్గాప్రసాద్, మెరైన్ పోలీసులు గస్తీ కాసారు. 10మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

- పూసపాటిరేగ, నవంబరు24(ఆంధ్రజ్యోతి)

స్త్రీకి భద్రత ఉందా?

- నేటికీ గృహహింస.. అత్యాచార ఘటనలు
- చట్టాలను వినియోగించుకోలేని దైన్యం
- నేడు మహిళలపై హింస నిర్మూలనా దినం

7లో



పైడిమాంబను దర్శించుకున్న అశోక్

- కుటుంబ సమేతంగా పూజలు
- ఎమ్మెల్యే అదితి పుట్టినరోజు పురస్కరించుకుని దర్శనం


విజయనగరం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబను ఆదివారం మాన్సాస్ ఛైర్మన్ అశోక్ గజపతిరాజు, ఆయన సతీమణి సునీలా గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు దర్శించుకున్నారు. అదితి పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఈవో డీవీ ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలతో పాటు, అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్ఞాపికను అందజేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో టీడీపీ నగర, మండల నాయకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేక్‌ను అదితి కట్ చేశారు. నగరం, మండల పరిధిలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. పుట్టిన రోజు సందర్భంగా నగరంలోని పేర్లవారి వీధిలో వున్న విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ఆరుగురు విద్యార్థులను ఎమ్మెల్యే అదితి దత్తత తీసుకున్నారు. వీరికి ఏడాది పాటు అయ్యే వ్యయాన్ని చెక్ రూపంలో అందజేశారు.



అమ్మవారికి నమస్కరిస్తున్న అశోక్ కుటుంబ సభ్యులు

పార్లమెంటులో జిల్లా సమస్యలను ప్రస్తావిస్తా

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



విజయనగరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విజయనగరం జిల్లా సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బొబ్బిలి-సాలూరు రైలు బస్సు పునరుద్ధరణ, విశాఖ స్టీల్‌కు అనుబంధంగా బొబ్బిలి గ్రోత్ సెంటర్లో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరతానన్నారు. వృథాగా వున్న బాడంగి ఎయిర్‌బేస్‌ను వినియోగంలోకి తేవాలని, మానాపురం వద్ద నిర్మిస్తున్న ఆర్వోబీ పనులు వేగవంతం చేయాలని ప్రస్తావిస్తానన్నారు. తోటపల్లి కాలువ నుంచి మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించేలా లిఫ్ట్ ఇరిగేషన్‌లు ఏర్పాటు చేయాలని, బొబ్బిలి ఐటీఐ, గురుకులాలను ఎడ్యుకేషన్ టెక్నికల్ హబ్‌లుగా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతాన్ని వన్యప్రాణులు సంరక్షణ కేంద్రం, పర్యాటక ప్రాంతంగా గుర్తించాలన్న అంశాలను పార్లమెంటులో ప్రస్తావిస్తానన్నారు.

బాలికను ప్రేమించానంటూ

సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్

- యువకుడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పోక్సో కేసు నమోదు

బొబ్బిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను ప్రేమించానని.. ఆమెను తనకు ఇచ్చి పెళ్లి చేయాలని డిమాండ్ చేస్తూ ఓ యువకుడు ఆదివారం హల్‌చల్ చేశాడు. సెల్‌టవర్ ఎక్కి బెదిరించాడు. చివరకు పోలీసులు అతన్ని కిందకు దించి నిందితునిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి.

బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి దాడితల్లి కాలనీకి చెందిన సింగారు అజయ్ అనే యువకుడు డెకరేషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సీతానగరం ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలని కోరాడు. అందుకు బాలిక తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో ఆ యువకుడు ఆత్మహత్యా ప్రయత్నం చేయాలనుకున్నాడు. ఆదివారం సాయంత్రం గొల్లపల్లిలోని సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ప్రేమించిన అమ్మాయితో పెళ్లి చేయకపోతే టవర్‌పై నుంచి దూకేస్తానని బెదిరించాడు. విషయం తెలిసి ఇన్‌చార్జి సీఐ నారాయణరావు, ఎస్ఐ రమేష్‌లు అక్కడకు చేరుకుని అజయ్‌ను ఒప్పించేందుకు ప్రయత్నించారు. అమ్మాయి వచ్చి అంగీకారం తెలిపితేనే టవర్ దిగుతానని మొండికేశాడు. దీంతో పోలీసులు ఆ బాలికను తీసుకొచ్చారు. అనంతరం కిందికి దిగిన అజయ్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. విచారణ జరిపిన తరువాత బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ప్రస్తుతం అజయ్ భవానీ మాలధారణలో ఉన్నాడు. ఎస్ఐ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వరి ఆశాజనకం

- జిల్లాలో ముమ్మరంగా కోతలు
- 3,577 హెక్టార్లలో అదనంగా పంట
- 510 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణ

విజయనగరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరి పంట ఈ ఏడాది ఊరట ఇచ్చింది. రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి స్థిరీకరణతో ఖరీఫ్‌లో ఆయకట్టుకు ఇబ్బందులు ఎదురుకాలేదు. వర్షాధార భూముల్లో మాత్రం ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. నీటి తడులు అందించేందుకు రైతులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఎట్టకేలకు వరి పక్వానికి రావడంతో రైతులు కోతలు ప్రారంభించారు. గత ఏడాది కంటే 3577 హెక్టార్లల్లో అదనంగా వరి సాగుచేశారు. గత ఏడాది 93,820 హెక్టార్లల్లో సాగు చేపట్టగా ఈసారి 97,397 హెక్టార్లలో సాగుచేశారు. ప్రధానంగా 1121 రకం ధాన్యం సాగు వల్ల వేగంగా పంట దిగుబడి వచ్చినట్టు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎకరాకు 22 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు.

గత అనుభవాల దృష్ట్యా..

గత అనుభవాల దృష్ట్యా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా 510 ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటుచేశారు. అవసరానికి తగ్గట్టు వాటిని మరింతగా విస్తరించనున్నారు. కేంద్రాల్లో ఉన్న తేమకొలిచే యంత్రాలను మండల వ్యవసాయ శాఖ కార్యాలయాలకు తరలించారు. అక్కడ పౌర సరఫరాల శాఖ సాంకేతిక సిబ్బంది పరిశీలించనున్నారు. అందుకు అనుగుణంగా కొనుగోలు చేయనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరను ప్రకటించింది. సాధారణ రకం క్వింటా ధర రూ.2300, 40 కిలోలు రూ.920, 80 కిలోలు రూ.1840గా నిర్ణయించారు. మరోవైపు ఏ గ్రేడ్ ధాన్యం క్వింటా ధర రూ.2320, 40 కిలోలు రూ.928, 80 కిలోలు రూ.1856గా నిర్ణయించారు. జిల్లాలో 3.20 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.



కూపన్లు జారీ

ధాన్యం సేకరించే అధికారులు నేరుగా రైతు కళ్లాల వద్దకు వెళ్లి నూర్పులు వేసిన చోట కూపన్లు జారీ చేస్తారు. ధాన్యం సేకరించిన సమయంలో సిబ్బందికి సెలవులు ఇవ్వడం లేదు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం సేకరించి జీపీఎస్ వాహనంలో మిల్లులకు పంపిస్తారు. ట్యాగ్ చేసిన మిల్లుకే వెళ్తుంది. ఒక వేళ వాహనం దారి మళ్లినా, మిల్లులకు రీచ్ కాకపోయినా జిల్లా అధికారులకు మెసేజ్ వెళ్తుంది. వాహనం మిల్లుకు వచ్చినప్పుడు పూర్తి బాధ్యత కస్టోడియన్ అధికారిపై ఉంటుంది. వాహనం వచ్చిన తరువాత బండి నెంబరుతో ఫొటో తీసి దాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. మిల్లుకు వచ్చిన ధాన్యం అన్‌లోడ్ చేయించే విధంగా మిల్లరు హమాలీలను సమకూర్చుకోవాలి. మిల్లరు నుంచి రసీదు ఇవ్వడం కస్టోడియన్ బాధ్యత.

- ధాన్యం అమ్మిన 48 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాలో చెల్లింపులు చేయనుంది. అలాగే రైతులు మిల్లుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. సమీప కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే సరిపోతుంది. కల్లాల నుంచి నేరుగా రైతుసేవా కేంద్రాలకు తరలించాలి. అందుకయ్యే రవాణా చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుంది. లేకుంటే వాహనాలను సమకూర్చుతుంది.

బయోమెట్రిక్ వేయడమే.

వైసీపీ ప్రభుత్వంలో రవాణా చార్జీలు, హమాలీల చార్జీల పేరిట భారీ మోసాలు జరిగాయి. దీనిపై లోకాయుక్తా విచారణ చేసేవరకూ పరిస్థితి వచ్చింది. అయితే బినామీ రైతులను చూపి భారీగా పక్కదారి పట్టించినట్టు వెలుగులోకి వచ్చింది. 2021-22లో అయితే ఉమ్మడి జిల్లాలో హమాలీల చార్జీల పేరిట రూ.7.5 కోట్లు పక్కదారి పట్టించారు. అప్పట్లో టన్నుకు హమాలీల చార్జీల కింద రూ.27 చెల్లించినట్టు చూపారు. 95 సొసైటీలకు గాను కేవలం రెండు సొసైటీల్లోనే చెల్లించారు. అయితే చాలాచోట్ల బినామీల పేరుతో కైంకర్యం చేసినట్టు ఫిర్యాదులున్నాయి. ఇంకో వైపు రవాణా చార్జీలు రూ.6.5 కోట్లు ఇప్పటికీ చెల్లింపునకు నోచుకోలేదు. ఈ నిధులు కూడా పక్కదారి పట్టించినట్టు ఆరోపణలున్నాయి. అందుకే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. పారదర్శకంగా ధాన్యం సేకరణ ప్రక్రియ చేపట్టాలని చూస్తోంది.

పారదర్శకంగా కొనుగోలు

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నాం. రైతులు తమకు నచ్చిన మిల్లులకు ధాన్యం పంపించుకోవచ్చు. రైతుసేవా కేంద్రాలకు వెళితే సరిపోతుంది. జీపీఎస్ గల వాహనాలను ఏర్పాటుచేస్తారు. రైతులు నూర్పులు వేసిన చోట కూపన్లు అందజేస్తారు. ట్రక్ షీట్ జనరేట్ చేసిన తరువాత బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా ఖాతాల్లో నగదు జమ అవుతుంది.

- సేతు మాధవన్, జాయింట్ కలెక్టర్

బీమా సుగమ్ కోసం రూ.500 కోట్లు

ముంబై: భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) తలపెట్టిన 'బీమా సుగమ్' ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బీమా మంథన్ సదస్సులో బీమా కంపెనీలు ఈ అంచనాకు వచ్చినట్టు సమాచారం. అన్ని రకాల బీమా పాలసీల మార్కెటింగ్, ఇతర సేవలు ఒకే చోట అందించేందుకు ఐఆర్‌డీఏఐ ఈ సింగిల్ విండో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను తలపెట్టింది. ఇందుకు రూ.100 నుంచి రూ.200 కోట్లు ఖర్చవుతుందని మొదట్లో అంచనా వేశారు. తాజా అంచనాల ప్రకారం ఇందుకు ఎంతలేదన్నా రూ.500 కోట్లు ఖర్చవుతుందని కంపెనీలు ఒక అంచనాకు వచ్చాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభానికల్లా దీన్ని అమలు చేయాలని ఐఆర్‌డీఏఐ యోచిస్తోంది.

దీన్ దయాళ్ క్షేత్రంలో అరకొర ఉత్పత్తితో

ఓఎన్‌జీసీకి తిప్పలు



రోజుకు కేవలం 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ గ్యాస్ ఉత్పత్తి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ తీరంలోని కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లో ఉన్న దీన్ దయాళ్ సహజ వాయువు క్షేత్రం.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి పెద్ద గుదిబండలా మారింది. భారీ గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయనే పేరుతో గుజరాత్ ప్రభుత్వ రంగ సంస్థ గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (జీఎస్‌పీసీఎల్) ఈ గ్యాస్ ఫీల్డ్‌ను 2017 జూలైలో ఓఎన్‌జీసీకి అంటగట్టింది. అంతకు ముందే జీఎస్‌పీసీ ఈ సహజ వాయు క్షేత్రంలో తనకున్న 80 శాతం వాటాలో 50 శాతం ఇస్తానన్నా ఓఎన్‌జీసీ తిరస్కరించింది. అయితే 2017కు వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. దీన్ దయాళ్ ఫీల్డ్ ఈక్విటీలో తనకున్న మొత్తం 80 శాతం వాటాను జీఎస్‌పీసీ.. ఓఎన్‌జీసీకి రూ.7,738 కోట్లకు విక్రయించింది.

అంతా 'గ్యాసే'

జీఎస్‌పీసీఎల్ ఈ గ్యాస్ ఫీల్డ్‌లో 20 లక్షల కోట్ల ఘనపుటడుగుల (టీసీఎఫ్) గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు, దీన్నుంచి రోజూ 20 కోట్ల ప్రామాణిక ఘనపుటడుగుల (ఎంఎస్‌సీఎఫ్‌పీడీ) గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని మొదట్లో గ్యాస్ కొట్టింది. ఓఎన్‌జీసీకి తన 80 శాతం వాటా అమ్మే నాటికే జీఎస్‌పీసీ ఈ క్షేత్రంలో మూడు గ్యాస్ బావులు తవ్వింది. ఓఎన్‌జీసీ చేతికి వచ్చాక మరో ఏడు బావులు తవ్వారు. సాంకేతిక సమస్యలతో ఇందులో మూడు బావుల డ్రిల్లింగ్ మధ్యలోనే ఆపేశారు. పూర్తి చేసిన మిగతా నాలుగు బావుల్లోనూ రోజువారీ గ్యాస్ ఉత్పత్తి 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ మించడం లేదు.

ఖర్చు బారెడు

తన చేతికి వచ్చాక ఓఎన్‌జీసీ.. దీన్ దయాళ్ క్షేత్రం ఫీల్డ్ అభివృద్ధి కోసం పెద్ద మొత్తమే ఖర్చు చేసింది. ఈ కొనుగోలుతో జీఎస్‌పీసీఎల్ మాత్రం తన అప్పుల భారం కుదించుకుంది. ఓఎన్‌జీసీ మాత్రం తన మిగులు నిధుల్లో ఎక్కువ భాగం ఇందుకోసం ఖర్చు చేయాల్సి వచ్చింది. మంచి ఆర్థిక స్తోమత, టెక్నాలజీ ఉన్న ఏదైనా సంస్థ ముందుకు వస్తే భాగస్వామ్యంతో దీన్ దయాళ్ గ్యాస్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేయాలని ఓఎన్‌జీసీ చూస్తోంది. అందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఈ గ్యాస్ ఫీల్డ్ ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీకి పెద్ద భారంగా మారింది.

24,300 పైన బుల్లిష్

(నవంబరు 25-29 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్నికల్ అనాలసిస్

నిఫ్టీ గత వారం 24,956-23,263 పాయింట్ల మధ్యన కదలాడి 375 పాయింట్ల లాభంతో 23,907 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,562, 23,644, 23,909, 24,482 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,300 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,400

నిరోధ స్థాయిలు: 24,100, 24,200, 23,400 (24,000 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23,700, 23,500, 23,400 (23,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	595
వరంగల్	582	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	108
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	75
కర్నూలు	107	నెల్లూరు	75
విశాఖపట్నం	120	అనంతపురం	75
గోదావరి	108		

హీరో, జీరో భాగస్వామ్యంలో కొత్త ఈ-బైక్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ భాగస్వామ్యంలో హీరో మోటో కార్ప్ రూపొందిస్తున్న మిడ్ పెర్ఫార్మెన్స్ విద్యుత్ బైక్ అభివృద్ధి అడ్వాన్స్‌డ్ దశలో ఉన్నదని చెబుతున్నారు. ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీలో పేరెన్నిక గన్న కాలిఫోర్నియాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ 6 కోట్ల డాలర్ల ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు హీరో మోటో కార్ప్ డైరెక్టర్ల బోర్డు 2022 సెప్టెంబరులో ఆమోదించింది. తమ భాగస్వామ్యంలో ప్రీమియం విద్యుత్ బైక్‌లు రూపొందిస్తామని 2023లో రెండు కంపెనీలు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యంలో మిడ్ పెర్ఫార్మెన్స్ ఈ- బైక్ అభివృద్ధి దశలో ఉన్నదని హీరో మోటో కార్ప్ సీఈఓ నిరంజన్ గుప్తా తెలిపారు.

డిసెంబరులోనూ ఐపీఓల జోరు

10 ఇష్యూలు.. రూ.20,000 కోట్ల సమీకరణ!

నూఢిల్లీ: సెకండరీ మార్కెట్ ఆటుపోట్లలో ఉన్నా, ప్రైమరీ మార్కెట్ జోరు తగ్గడం లేదు. వచ్చే నెల కూడా 10 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల ద్వారా రూ.20,000 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో సూపర్ మార్కెట్ చెయిన్ విశాల్ మెగా మార్ట్, బ్లాక్‌స్టోన్ నిర్వహణలోని డైమండ్ గ్రేడింగ్ కంపెనీ ఇంటర్నేషనల్ జెమ్మోలాజికల్ ఇనిస్టిట్యూట్ (ఇండియా) లిమిటెడ్, హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సాయి లైఫ్ సైన్సెస్ కూడా ఉన్నట్టు మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు చెప్పాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, యూపీ ఉప ఎన్నికల ఫలితాలతో ఐపీఓ మార్కెట్ సెంటిమెంట్ పెరుగుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ వారం రాజేష్ పవర్ సర్వీసెస్ సహా మొత్తం ఆరు పబ్లిక్ ఇష్యూలు ప్రారంభమవుతుండగా ఎన్‌టీపీసీ గ్రీన్‌తో పాటు మరో మూడు కంపెనీలు మార్కెట్లో లిస్ట్ కానున్నాయి.

లాభాల బాటలోనే.!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, డాలర్ దూకుడు తగ్గటం, చైనా ఉద్దీపన పథకంతో పెద్దగా ప్రయోజనాలు లేకపోవటం, విదేశీ సంస్థాగత మదుపరులు మళ్లీ తిరిగొచ్చే సూచనలు, అదానీపై కోర్టు అభియోగాల ప్రభావం తగ్గిపోవటమే ఇందుకు కారణాలు. గత శుక్రవారం సెషన్ ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం నింపింది. ఫండమెంటల్స్ బలంగా ఉన్న షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో బీజేపీ విజయం కూడా పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపింది.

స్టాక్ రికమండేషన్స్

జుబిలెంట్ ఫుడ్స్: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. తాజా త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉండటం, ఈపీఎస్ పెరగటంతో మూమెంటమ్ కనిపిస్తోంది. జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ షేరు కొంత దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం ఈ షేరు అక్యుములేషన్ జోన్‌లో ఉంది. గత శుక్రవారం 4.5 శాతం లాభంతో రూ.637 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.630/600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.675/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.580 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పేటీఎం: పేమెంట్ బ్యాంక్ సేవలకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనుమతి ఇచ్చినప్పటి నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో దూసుకుపోతోంది. నష్టాల మార్కెట్లోనూ పటిష్ఠతను సూచించింది. రిలేటివ్ స్ట్రెంత్ చాలా బాగుంది. ప్రస్తుతం కీలక రెసిస్టెన్స్ జోన్ వద్దకు చేరుకుంటోంది. దాన్ని బ్రేక్ చేస్తే ఇక తిరుగులేదు. గత శుక్రవారం 6.5 శాతం లాభంతో రూ.900 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.860 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫీనిక్స్ మిల్స్ లిమిటెడ్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 33 శాతం మేర పతనమైంది. తాజాగా మళ్లీ పెరుగుతూ వస్తోంది. చివరి నాలుగు సెషన్లలో ఏకంగా 18 శాతం పెరిగింది. గత శుక్రవారం 5.33 శాతం లాభంతో రూ.1,616 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,600 స్థాయిలో ప్రవేశించి రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,560 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సుప్రియా లైఫ్ సైన్సెస్: ఐపీఓ ఇష్యూ ధర నుంచి 70 శాతం మేర పతనమైన ఈ షేరు గత ఏడాది మార్చి నుంచి టర్న్ అరౌండ్ అయ్యాయి. అప్పటి నుంచి బుల్‌రన్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ షేరుకు ఐపీఓ గరిష్ఠ స్థాయి వద్ద మద్దతు లభించింది. సేల్స్ ఈపీఎస్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం 14 శాతం లాభంతో రూ.806 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.780 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.860/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విజయ డయాగ్నోస్టిక్స్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. మెరుగైన ఫలితాలు ప్రకటించటం, ఈపీఎస్, సేల్స్ పెరగటంతో మూమెంటమ్ పెరిగింది. బడా ఇన్వెస్టర్లు అక్యుములేట్ చేసుకుంటున్నారు. చివరి మూడు సెషన్లలో 25 శాతం పెరిగిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,160 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,000 ఎగువన నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో డౌన్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 23,300 కన్నా దిగజారినా శుక్రవారం ఏర్పడిన బలమైన రికవరీలో 560 పాయింట్ల మేరకు లాభపడింది. చివరికి గత వారంతో పోల్చితే 375 పాయింట్ల లాభంతో 23,900 సమీపంలో ముగిసింది. టెక్నికల్‌గా మార్కెట్ ఎనిమిది వారాల డౌన్‌ట్రెండ్ అనంతరం రిలీఫ్ ర్యాలీ సాధించింది. అయితే మార్కెట్ ఇప్పటికీ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. మార్కెట్ నిట్టనిలువుగా బౌన్స్‌బ్యాక్ సాధించినందు వల్ల స్పష్టమైన సందేశం ఇవ్వాలంటే కన్సాలిడేట్ కావడం తప్పనిసరి. అయితే ఈ రివర్సల్‌తో తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పును మాత్రం తప్పించుకుంది. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 975 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 155 పాయింట్లు లాభపడ్డాయి. ఈ వారంలో నిఫ్టీ మరింత పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో 24,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత పాజిటివ్ సంకేతం ఇవ్వాలంటే నిఫ్టీ తదుపరి నిరోధం 24,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధ స్థాయిలు 24,350, 24,550. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు.

బేరిష్ స్థాయిలు: ఏ మాత్రం బలహీనత ప్రదర్శించినా మద్దతు స్థాయి 24,000 వద్ద కన్సాలిడేషన్ తప్పనిసరి. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిలు 23,800, 23,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 950 పాయింట్ల మేరకు రికవరీ సాధించి చివరికి 51,000 కన్నా స్వల్పంగా పైన క్లోజైంది. మరింత సానుకూలత కోసం తదుపరి నిరోధం 51,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,200. ప్రస్తుత మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 49,400.

పాటర్న్: నిఫ్టీ గత వారం 200 డీఎంఏ వద్ద రికవరీ సాధించింది. ఇప్పుడు నిరోధ స్థాయి 24,100 సమీపంలో గల 25 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. మార్కెట్ గత వారం ఓవర్‌సోల్డ్ స్థితి నుంచి కోలుకుంటున్నట్టు కనిపిస్తోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	24,000, 24,155
మద్దతు	24,000, 23,920

నవ్య | చిత్రజ్యోతి



ఆ కోరికను పుష్ప 2 తీర్చింది

'పుష్ప చిత్రం అంతర్జాతీయ స్థాయిలో నాకు నటుడిగా గుర్తింపును ఇచ్చింది. డిసెంబర్ 5న వస్తున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రంతో దేశవ్యాప్తంగా వైల్డ్ ఫైర్ రాబోతోంది. మూడేళ్లు నా జీవితాన్ని ఈ సినిమాకు అంకితం చేశాను. హీరో అయినప్పటి నుంచి చెన్నైలో నా సినిమా కార్యక్రమం ఒక్కటైనా చేయాలనుకుంటున్నాను. ఆ కోరికను 'పుష్ప 2' తీర్చింది' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. ఆదివారం చెన్నైలో 'వైల్డ్ ఫైర్' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అల్లు అర్జున్, శ్రీలీల నర్తించిన ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ 'రష్మిక తక్కువ సమయంలోనే నా మనసుకు దగ్గరయ్యారు. తను నన్ను చాలా బాగా ప్రోత్సహించారు. అల్లు అర్జున్ పాట కావడంతో బాగా కష్టపడ్డాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'పుష్ప' కు ముందు తర్వాత అనేలా నా కెరీర్ మారింది. నా జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకంగా ఈ చిత్రం మిగిలిపోతుంది' అన్నారు.

ఖరీదైన కానుకలు ఇచ్చా



ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన వెబ్ సిరీస్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె హీరో వరుణ్ ధావన్‌తో 'స్పైసీ ర్యాపిడ్ ఫైర్' అనే సరదా సంభాషణలో పాల్గొన్నారు. 'ట్రూత్ అండ్ డేర్' గేమ్‌లా ఉండే ఇందులో.. వరుణ్ అడిగిన దానికి సమాధానం చెప్పాలి.. చెప్పలేకపోతే పచ్చిమిర్చి తినాలి. 'మీరు ఏ వస్తువుల కోసం డబ్బులు అనవసరంగా ఖర్చు చేశారు' అని వరుణ్ అడిగారు. "నా ఎక్స్‌కు ఇచ్చిన కానుకల కోసం' అని సమంత సమాధానమిచ్చారు. 'అవునా.. ఎంత ఖర్చైంది' అని వరుణ్ అడగ్గా.. 'కొంచెం ఎక్కువే.. ఇక, తరువాతి ప్రశ్నకు పోదామా' అని సమంత బదులిచ్చారు. 'మీరు ఈ కార్యక్రమానికి వచ్చే ముందు ఎవరికి చివరగా మెసేజ్ చేశారు. దాన్ని పైకి చదివి వినిపిస్తారా' అని వరుణ్ అడగ్గా.. ఆ ప్రశ్నకు సమాధానమివ్వని సామ్ పచ్చిమిర్చి తిన్నారు.

ప్రేమంటారా? కాదంటారా?



ప్రేమలో ఉన్నామని పైకి చెప్పకపోయినా తరచూ చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగుతూ కెమెరాలకు చిక్కుతున్నారు విజయ్‌దేవరకొండ, రష్మిక మందన్న. తాజాగా ఈ జంట మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది. వీరిద్దరూ కలసి ఓ రెస్టారెంట్‌లో భోజనం చేస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చెన్నైలో నిర్వహించిన 'పుష్ప 2' కార్యక్రమంలో 'మీ ప్రేమ, పెళ్లి గురించి చెప్పండి' అని యాంకర్ రష్మికను అడగ్గా 'తొందరెందుకు 'పుష్ప 2' విడుదలయ్యాక మీరే చూస్తారు కదా' అని బదులిచ్చారు. ఇండస్ట్రీకి చెందిన వ్యక్తా, బయట వ్యక్తా అని అడిగితే 'అది అందరికీ తెలిసిన విషయమే కదా' అంటూ స్పందించారు.

స్త్రీకి భద్రత ఉందా?



- నేటికీ గృహహింస.. అత్యాచార ఘటనలు
- చట్టాలను వినియోగించుకోలేని దైన్యం
- నేడు మహిళలపై హింస నిర్మూలనా దినం

పార్వతీపురం/సాలూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి)

మహిళల రక్షణే లక్ష్యంగా ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు రూపొందిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మారడం లేదు. ప్రతిచోటా అపాయాలు పొంచి ఉంటున్నాయి. బయటి వ్యక్తులు, స్నేహితులతో పాటు బంధువులు, కుటుంబ సభ్యుల నుంచి కూడా వారికి రక్షణ ఉండడం లేదు. ఎంతోమంది గృహ హింసకు గురవుతున్నారు. ప్రేమ పేరుతో మోసపోతున్నారు. పనిచేసే ప్రదేశాల్లోనూ లైంగిక దాడులకు గురై ఆత్మహత్య చేసుకుంటున్నారు. పనిచేస్తున్న చోట వేధింపులు ఉన్నా.. అవి సహించలేని స్థాయికి చేరే వరకు భరిస్తున్నారు. మరికొంత మంది వరకట్న వేధింపులు తాళలేక ఉసురు తీసుకుంటున్నారు. కాగా మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న వారిని ప్రభుత్వాలు కఠినంగా శిక్షిస్తున్నప్పటికీ కొంతమంది మృగాల్లో మార్పు కనిపించడం లేదు. మద్యం, గంజాయి మత్తులో యథేచ్ఛగా అకృత్యాలకు పాల్పడుతున్నారు. పసి పిల్లలు, బాలికలు, విద్యార్థినులపై దాడులకు తెగబడుతున్నారు. ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాల్సి ఉంది. ఇందుకోసం పకడ్బందీగా చట్టాలను అమలు చేయాలని పలువురు మేధావులు, ప్రజలు కోసం కోరుతున్నారు. నేడు మహిళలపై హింస నిర్మూలనా దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఇదీ పరిస్థితి..

కొంతమంది మహిళల నిస్సహాయత, నిరక్షరాస్యత ఆసరాగా చేసుకుని వారిని వేధించడాన్ని శాడిస్టిక్ ప్లెజర్ అని మానసిక నిపుణులు అంటున్నారు. సామాజిక వివక్ష, దిగజారిన విలువలు వల్ల హింస పెరుగుతున్నట్టు సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. పేదరికంలో ఉన్న మహిళపై అధిపత్యధోరణితో హింసకు పాల్పడుతున్న సంఘటనలున్నాయి. ఆడపిల్లల్లో ఆత్మ విశ్వాసం పెంచడానికి కుటుంబం సరైన పాత్ర పోషించాలని సైకాలజిస్ట్ రాజశేఖర్ అభి ప్రాయపడ్డారు. ఆడపిల్లలపై ఆంక్షల వల్ల వారి ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం నీరుగారు తుందన్నారు.

ఈ చర్యలు తీసుకుంటే..

గతంతో పోల్చుకుంటే మహిళలపై హింసలు తగ్గినప్పటికీ పూర్తిస్థాయిలో వీటిని నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, బాధ్యత గల పౌరులపై ఉంది. మహిళలు, బాలికలపై హింసను నిర్మూలించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. మహిళలపై అకృత్యాల నివారణకు సమాజాన్ని చైతన్యవంతం చేయాలి. మహిళల్లో హింస నిర్మూలనకు మద్యం విక్రయాలను నియంత్రించాలని, ఇంటర్నెట్‌లో అభ్యంతరకర సైట్‌లను నిషేధించాలని హెల్ప్ లైన్ నెంబర్లు విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రజాసంఘాల నేతలు కోరుతున్నారు. మహిళ పై హింస, వేధింపులకు పాల్పడిన వారికి సత్వరం సరైన శిక్షలు అమలు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలో కొన్ని ఘటనలు..

● ఈ ఏడాది అక్టోబరు 6న భామిని మండలంలో ఓ బాలికపై వరుసకు తాత అత్యాచారం చేశాడు. ● మార్చి 22న జియ్యమ్మవలస మండలంలోని ఓ గ్రామంలో భార్యను భర్త కత్తితో పొడిచి పరారయ్యాడు. ● జనవరి 20న గరుగుబిల్లి మండలం తోటపల్లి జలాశయంలో ఓ యువతి మృతదేహం లభ్యమైంది. ● జనవరి 25న పాలకొండ మండలంలోని ఓ మహిళా పోలీస్‌పై భర్త దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ● సాలూరు మండలానికి చెందిన ఓ మహిళకు విశాఖలో ఓ యువకునితో వివాహం జరిగింది. దురదృష్టవశాత్తు స్వల్పకాలానికే భర్త మరణించాడు. మరిది ఆమెను వేధించడం ప్రారంభించాడు. దీంతో ఆమె కన్నవారింటికే చేరాల్సి వచ్చింది. జిల్లాలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలు కఠినంగా అమలు చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు.

హెల్ప్‌లైన్లు వినియోగించుకోవాలి

మహిళలు వేధింపులు, హింసకు గురైనప్పుడు టోల్ ఫ్రీ, హెల్ప్ నెంబర్లకు ఫోన్ చేస్తే తక్షణ సాయమందుతుంది. ఉమెన్ హెల్ప్‌లైన్ 181, డయల్ 100, 112 నెంబర్లు ఫోన్ చేయాలి. బాలికల కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి ఫోన్ చేయాలి. మహిళలు ఇబ్బంది పడితే హెల్ప్‌లైన్ల వినియోగించుకోవడం, సమీప పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం మంచిది. మహిళలపై హింస, వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

-బి.అప్పలనాయుడు, సాలూరు టౌన్ సీఐ

న్యూస్ బాక్స్

కంటి వైద్య శిబిరం

నెల్లిమర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి అధిక సంఖ్యలో రోగులు హాజరయ్యారు. వారిలో 20మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శిబిరం నిర్వహణకు షిర్డీసాయి ఆలయ కమిటీ ప్రతినిధి జగన్నాథరాజు సహకరించారు.

జర్నలిస్టులకు అండగా ప్రభుత్వం

భోగాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం భోగాపురం మండలంలోని దిబ్బలపాలెం గ్రామ శివార్లలో జర్నలిస్టులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరంతర శ్రామికుడు జర్నలిస్టేనని, సమాజానికి ఉపయోగపడేటట్టు సేవ చేయాలన్నారు. తనకు ఎంపీ పదవితో పాటు జర్నలిస్ట్ పేరు కూడా అంతే సంతృప్తినిస్తుందన్నారు. సమాచార శాఖ ఏడీ రమేష్, దిబ్బలపాలెం ఎంపీటీసీ ఎస్‌పీఎల్, జర్నలిస్టుల ప్రతినిధి బి శ్రీనివాసరావుతో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

రేపు సాముహిక సత్యనారాయణ వ్రతాలు

రేగిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రేగిడి దత్తపీఠంలో ఈనెల 26న కార్తీక బహుళ ఏకాదశ సందర్భంగా దత్తపీఠ నిర్వాహకులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేసేందుకు దత్తకమిటీ అన్ని ఏర్పాట్లు చేసినట్టు దత్తపీఠ గురువు కిమిడి సత్యనారాయణ, కన్వీనర్ శ్రీనివాసరావు మాస్టర్ ఆదివారం స్థానిక విలేఖర్లకు తెలిపారు. ఉదయం 9గంటలకు ఆసక్తి గల జంటలు హాజరుకావాలని, దత్తపీఠ ఉసిరివనంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పూజా సామగ్రితో రావాలని, మిగతా సౌకర్యాలు దత్తపీఠం ఏర్పాటు చేస్తుందన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మొద్దు

రాజాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం రేణుకాసాయి హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదేశాలు మేరకు రాజాం పట్టణంలో ఎరువుల మందుల దుకాణా లను ఆదివారం తనిఖీ చేశారు. ప్రతి షాపు యజమాని ఎంఆర్‌పీ ధరలకు మాత్రమే విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే షాపులు సీజ్ చేస్తామన్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి

విజయనగరం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మధ్యంతర భృతిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు అన్నారు. ఆదివారం కోట జంక్షన్ సమీపంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సకాలంలో సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయంఎదుట వచ్చే నెల 21న ధర్నా నిర్వహిస్తామన్నారు.

సామాజిక సమస్యలతోనే రచనలు

రాజాం,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొని ఉన్న అనేక రుగ్మతల్ని, సమస్యల్ని ప్రస్తావిస్తూ వీలైతే వాటికి పరిష్కారాలను సూచిస్తూ కవులు, రచయితలు తమ రచనలను కొనసాగించాలని ప్రముఖ నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడు కోరారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ మజ్జి భారతి రచించిన 'వేకువ' కథా సంపుటాన్ని మజ్జి చంద్రినాయుడు ఆవిష్కరించారు.

అదానీ కుంభకోణంపై నిరసన

భోగాపురం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): అదానీ అవినీతి కుంభకోణంపై భోగాపురం గ్రామం ఎత్తుబ్రిడ్జి సమీపంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ పదేళ్ల పాలనలో గౌతం అదాని అవినీతి తారాస్థాయికి చేరిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. రమేష్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పిక్నిక్ ప్రాంతాల్లో పటిష్ఠ నిఘా

విజయనగరం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో కార్తీకమాస వారంతం సందర్భంగా విహారయాత్రలకు, పిక్నిక్‌లకు ఎక్కువ మంది ప్రజలు వెళ్లేందుకు అవకాశం ఉన్నందున అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పిక్నిక్ కేంద్రాలు, విహార ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మహిళల భద్రతకు నిఘా ఏర్పాటు చేయాలని, వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. డే బీట్లు, బందోబస్తు మహిళా బీట్‌ను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. పిక్నిక్ పేరుతో అసాంఘిక కార్యక్రమాల నిర్వహణకు తావులేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పేకాట, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం భద్రత ఏర్పాట్లను డీఎస్పీలు శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, రాఘవులు పర్యవేక్షించగా, సీఐలు, ఎస్‌ఐలు భద్రతా చర్యలు చేపట్టారు.



బీచ్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది

సర్పంచులకు విలువ ఇవ్వాల్సిందే



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

జామి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉండే ప్రథమపౌరుడు సర్పంచ్, ఎంపీటీసీలకు విలువ ఇవ్వకపోతే సహించేది లేదని అధికారులకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. ఆదివారం జామి మండలపరిషత్ మందిరంలో జరిగిన బడ్జెట్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, జడ్పీటీసీ సరయు ఆధ్వర్యంలో సర్పంచ్, ఎంపీటీసీలు మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే తమకు అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని, పనుల ప్రతిపాదన, అమలు విషయాల్లో రాజ్యాంగ ఉల్లంఘన చేస్తున్నారని, అభివృద్ధి పనులకు సర్పంచ్‌ల తీర్మానాలు అవసరం లేదా అంటూ నిలదీశారు. ఇంకా ఇదే పరిస్థితి ఉంటే తాము ఎంతవరకైనా వెళ్తామని, తమకు చట్టం.. న్యాయం అండగా ఉంటాయన్నారు. కార్యక్రమం యావత్తు రసాభాసగా మారింది. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తగిన గౌరవం దక్కకపోతే తన దృష్టికి తేవాలన్నారు. అన్నివేళల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి ధీమా

● ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు



సభ్యత్వ నమోదు కార్యక్రమంపై వివరిస్తున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో శాశ్వత సభ్యత్వం పొందితే కుటుంబం ధీమాగా ఉంటుందని నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలం లింగాలవలస గ్రామంలో ఆదివారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కలిగించారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా ద్వారా రూ.5లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో టీడీపీ అండగా ఉంటుందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం పండగలా నిర్వహించాలన్నారు. అనంతరం పలువురి ఇళ్లకు వెళ్లి సభ్యత్వం నమోదు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుగత లలిత, బుగత రామ్మోహనరావు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

గవరల సంక్షేమానికి కృషి

● రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్లా సురేంద్ర



మాట్లాడుతున్న రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్లా సురేంద్ర

విజయనగరం రూరల్, నవంబరు 24: రాష్ట్రంలో గవరల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్లా సురేంద్ర చెప్పారు. శనివారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లాల వారీ పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన విజయనగరం వచ్చారు. స్థానికంగా జరిగిన గవర సంక్షేమ సంఘ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో గవర్ల సంక్షేమానికి ఆశించిన స్థాయిలో కృషి జరగలే దన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 150 రోజుల్లోగానే కార్పొరేషన్లు ఏర్పాటు చేయ డంతో పాటు, వాటికి విధులు, అధికారాలు ఇచ్చే విధంగా కసరత్తు జరుగుతోంద న్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గవర సంక్షేమ సం ఘం విజ యనగరం, విశాఖపట్టణం జిల్లా అధ్యక్షులు బొద్దు శీవాజీ, ఎంకేటీ నాయుడు మాట్లాడారు. మల్లా సురేంద్రను పలువురు సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు.

శాంతమ్మకు రాష్ట్ర స్థాయి అవార్డు



అచ్చెన్నాయుడు చేతులు మీదగా అవార్డును అందుకుంటున్న శాంతమ్మ

రాజాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజాంకు చెందిన నవదుర్గ లైవ్‌ఫిష్ సెంటర్ ఫిష్ ఆంధ్రా డైలీ యజమాని బెహరా శాంతమ్మకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇటీవల జరిగిన ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ఆమెకు ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర బెస్ట్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్స్(ఉత్తమ మహిళా వ్యవస్థాపకురాలు) అవార్డును మత్స్యశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, పశు సంవర్ధక శాఖ, పాడిపరిశ్రమ మత్స్యశాఖ సెక్రటరీ నాయక్ పాల్గొన్నారు. అనంతరం శాంత మ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకా రులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ని ధులు సక్రమంగా వినియోగిస్తున్నారని శాంతమ్మ వివరించారు.

ఏడీసీల అక్రమ సఫలింగ్ రద్దు చేయాలి

పాలకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఆర్టీసీ డిపో వద్ద రెండో రోజు ఆదివారం డిపో మేనేజర్ నిరంకుశ వైఖరికి నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఏడీసీల అక్రమ సఫలింగ్ రద్దు చేయాలని, డ్రైవర్, కండక్టర్లకు టిమ్ మిషన్‌లో డెబిట్స్ రద్దు చేయాలని అసోసియేషన్ జిల్లా చైర్మన్ కె.శంకరరావు కోరారు. ఈ గేట్‌మీటింగ్‌లో డిపో కార్యదర్శి వి.రాజేష్, సుబ్బారావు, ఎం.వైకుంఠం, ఎస్‌టీ రావు, డీవీ రమణ, ఏపీ ప్రసాద్, గ్యారేజ్ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

రేగిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రహదారి భద్రత ప్రమాణాలు పాటించాలని, ఇది అందరి బాధ్యతని స్థానిక ఎస్‌ఐ నీలావతి పేర్కొన్నారు. మండలంలో సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్స్ ఆధ్వర్యంలో ఆదివారం రహదారి భద్రత ప్రమాణాలపై డ్రైవర్లు, స్థానికులకు ఆమె చైతన్య సదస్సు నిర్వహించారు.

అయ్యప్ప స్వామికి క్షీరాభిషేకం

రాజాం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాస్తా సమాజంలో అయ్యప్పస్వామికి ఆదివారం విశేష పాలాభిషేకం నిర్వహించారు. సమాజ పీఠాధిపతి ఉమాశేషు గురుస్వామి సారథ్యంలో వేద పండితులు చెన్నైకు చెందిన వైద్యనాథంతో పాటు చంటి స్వామి, రాజుస్వామి తదితరుల ఆధ్వర్యంలో 300 లీటర్ల పాలతో అభిషేకించారు. ఓవైపు రుద్రాభిషేకం నిర్వహిస్తూ మరోవైపు భక్తులచే పాలాభిషేకం నిర్వహించారు. వేదపండితులకు పట్టణానికి చెందిన న్యాయవాది సంచాన చంద్రినాయుడు దంపతులు వస్త్రదానం చేశారు. ఆదివారం సాయంత్రం స్వామి మూలవిరాట్‌ను తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాలలో పట్టణంలోని అన్ని పీఠాలకు చెందిన అయ్యప్ప దీక్షాధారులు, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. అయ్యప్పస్వామి తిరువీధి ఉత్సవంలో భాగంగా సుమారు వెయ్యిమంది అయ్యప్ప దీక్షాధారులతో పురవీధుల్లో అయ్యప్ప స్వామి మూలవిరాట్‌ను ఊరేగించారు. ఈ సందర్భంగా శివుడు, వినాయకుడు, అయ్యప్పస్వామి, కుమారస్వామి, విష్ణువు, ఓవర్‌స్వామి, మాలికాపుర మాత వేషధారణలో చిన్నారుల ప్రదర్శన పట్టణ చూపరులను ఆకట్టుకుంది.



అయ్యప్పస్వామికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు



వేషధారణల్లో చిన్నారులు

జూట్‌మిల్లు లాకౌట్ సమస్యను పరిష్కరించాలి

కొత్తవలస, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస ఉమా జూట్ మిల్లు విధించిన అక్రమ లాకౌట్‌కు సంబంధించిన సమస్యను డిసెంబరు 4 లోగా పరిష్కరించాలని జూట్‌మిల్లుకు చెందిన కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం కొత్తవలసలో కార్మిక సంఘ కార్యాలయంలో కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్ పండా మాట్లాడుతూ కార్మికులు రాత్రనక పగలనక కష్టపడి యాజమాన్యానికి సహకరించి కంపెనీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. 2024 మే నెలలో నో వర్క్ నోపే కింద నడిపిస్తామని రాతపూర్వకంగా యాజమాన్యం హామీ ఇచ్చిందని, ఈ హామిని తుంగలో తొక్కిగడువు ముగియక ముందే జూలై 1న కంపెనీలో లాకౌట్ విధించి మోసం చేసిందని ఆరోపించారు. ఈ పరిస్థితులలో కార్మికులు డీసీఎల్, జేసీఎల్‌ను ఆశ్రయించగా డిసెంబరు 4లోగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించిందన్నారు. అప్పటిలోగా పరిష్కరించకపోతే యాజమాన్యాలపై బహిరంగ ఆందోళనకు సిద్ధపుతామని సమావేశంలో తీర్మానం చేశామన్నారు. కార్మికసంఘం ప్రతినిధులు కె.శ్రీను, కె.ఈశ్వరరావు, ఎస్.గోవింద, ఎస్. రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్ పండా

బైకులు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

రామభద్రపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆరికతోట దరి నరసాపురం జంక్షన్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామభద్రపురానికి చెందిన బాదంపూడి విశ్వేశ్వరరావు నరసాపురం శివాలయంలో పూజారిగా చేస్తున్నారు. అదే పనిమీద బైకుపై వెళ్తుండగా.. జగన్నాథపురం గ్రామానికి చెందిన ఈగల సింహాచలం, గోవర్ధన్ ఒకే బైకుపై ఎదురుగా వస్తున్నారు. నరసాపురం జంక్షన్ వద్దకు వచ్చేసరికి రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పూజారి విశ్వేశ్వరరావు కాలు విరిగింది. మిగతా ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షత గాత్రులను ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

జూదరులపై కేసు నమోదు

నెల్లిమర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారిపల్లి గ్రామ పరిసరాల్లో జూదమాడుతున్న పది మందిని నెల్లిమర్ల ఎస్‌ఐ బి.గణేష్, సిబ్బంది ఆదివారం పట్టుకుని వారిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 13,150 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులకు చట్టపరంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట, కోడిపందాలు జరిగితే 91211 09444 కు సమాచారం అందించాలని సూచించారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు

నెల్లిమర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో నేషనల్ కేడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) ముందంజలో ఉందని సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి అన్నారు. ఆదివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మా ట్లాడారు. యువతను బాధ్యతాయుతమైన నాయకులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ చేసిన సేవలను ఆయన కొనియాడారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్‌ఎస్ వర్మ మాట్లాడారు. ఐక్యూ ఏసీహెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, లెఫ్టినెంట్ సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ

నెల్లిమర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):యూటీఎఫ్ నెల్లిమర్ల మండల శాఖ అధ్యక్షుడిగా మద్దిల సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక ఆదివారం నెల్లిమర్లలోని పింఛన్‌దారుల సంఘ భవనంలో జరిగింది. సంఘం ప్రధాన కార్యదర్శిగా లెంక సన్యాసినాయుడు, గౌరవాధ్యక్షుడిగా గాడు పరమేశ్వరరావు, సహాధ్యక్షుడిగా వంగపండు సురేష్‌బాబు, కొండల పద్మావతి, కోశాధికారిగా బోని రమణ ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సురట రాజేంద్రప్రసాద్, సీపీఎస్ కన్వీనర్‌గా సుంకర చలపతిరావు ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్‌గా రెడ్డి అసిరినాయుడు, సభ్యులుగా పలువురు నియమితులయ్యారు. జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్ అభినందించారు.

ఆర్యవైశ్య వనసమారాధనలో ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట/శృంగవరపుకోట రూరల్, నవంబరు24: మండల కేంద్రమైన ఎస్.కోట పుణ్యగిరి డిగ్రీ కళాశాలలో ఆర్యవైశ్య వనసమారాధన, మండలంలోని రాజీపేట గ్రామం వద్ద కాపు కులస్థుల వనసమారాధన జరిగింది. ఆర్యవైశ్య సమారాధనలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొన్నారు. కాపుల వనసమరాధనలో జనసేన నేత గురాన అయ్యలు పాల్గొన్నారు.




ఎస్.కోట ఆర్యవైశ్య అన్నసమరాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ల

ఆడుతూ.. పాడుతూ..

- మన్యంలో పర్యాటకుల సందడి

సీతంపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలోని పర్యాటక ప్రాంతాలకు సందర్శకులు పోటెత్తారు. ఆడలి వ్యూ పాయింట్, మెట్టుగూడ జలపాతం, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులు పర్యాటకులతో కిక్కిరిసాయి. ఆదివారం ఆపై కార్తీక మాసం కావడంతో పెద్ద ఎత్తున మహిళలు, చిన్నారులు, పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులతో పర్యాటక ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. మెట్టుగూడ జలపాతం వద్ద తక్కువగా నీరు జాలు వారుతుండడంతో స్నానాలు చేసేందుకు సందర్శకులు ఇబ్బందులు పడ్డారు. ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో స్కై సైక్లింగ్, హ్యాంగింగ్ బ్రిడ్జ్, కమాండో నెట్, బంగ్లీ జంప్, క్లయింబింగ్ వాల్, షూటింగ్, బోటింగ్, 5డి థియేటర్ వంటి సాహసోపేతమైన క్రీడల్లో పాల్గొని ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.



క్లయింబింగ్ వాల్ ఎక్కుతున్న పర్యాటకుడు



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు



బంగీ జంప్ చేస్తున్న విద్యార్థిని



శిఖపరువు గోముఖీ జలపాతం వద్ద పర్యాటకులు



హేంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న పర్యాటకులు

జలపాతాల వద్ద పర్యాటకుల సందడి

సాలూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక ఆదివారం కావడంతో సాలూరు మండలంలో జలపాతాల వద్ద పర్యాటకులు సందడి చేశారు. దళాయివలస, శిఖపరువు, లొద్ద జలపాతాలకు పర్యాటకులు తరలివచ్చారు.

న్యూస్ బాక్స్

ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రారంభం

బొబ్బిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాతబొబ్బిలి సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీవాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపాన్ని బుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ఆదివారం ప్రారంభించారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు పూసర్ల గున్నేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, శంబంగి వేణుగోపాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై చర్యలు

బొబ్బిలి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గున్నతోటవలస గ్రామంలోని సోమివారి చెరువులో శనివారం అర్ధరాత్రి అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని తహసీల్దార్ ఎం.శ్రీను పట్టుకుని, స్థానిక రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. స్థానికుల సమాచారం మేరకు దాడి చేశామని చెప్పారు. గనుల శాఖ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

నేడు పారమ్మకొండపై శివ కల్యాణం

సాలూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పారమ్మకొండ వద్ద సాలూరు సనాతన ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 25న పార్వతీపరమేశ్వరుల కల్యాణం సుబ్బ గురువు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈసందర్భంగా వేలాది మందికి అన్నప్రసాదం అందించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరు కానున్నారు.

పూరిల్లు దగ్ధం

మెంటాడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చింతలవలస గ్రామంలో ముచ్చర్ల కోటికి చెందిన పూరిల్లు ఆదివారం అగ్నికి ఆహుతయ్యింది. కుటుంబ సభ్యులు పొలంలోకి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. ఇంట్లో పెట్టిన దీపాన్ని ఎలుకలు ఎత్తుకుపోవడం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. తిండిగింజలు, దుస్తులు, రేషన్, ఆధార్ కార్డులు కాలిపోయాయి.

మక్కువలో రెండు గడ్డి కుప్పలు..

మక్కువ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక చర్చి సెంటర్ సమీపంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. నూర్పు యంత్రం ద్వారా వచ్చిన గడ్డి 11 కేవీ వైర్ల మీద పడడంతో మంటలు చెలరేగాయి. ఈ నిప్పు రవ్వలు ఆర్లి రాజారావుకు చెందిన రెండు వరి గడ్డికుప్పలపై పడడంతో దగ్ధమయ్యాయి. స్థానిక యువత మంటలను అదుపు చేశారు.

మద్యం షాపు తరలించాలి

బొబ్బిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేదరబంద జంక్షన్‌లో మహిళల నిరసన కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది. మద్యం షాపును ఇక్కడ నుంచి తరలించాలని మహిళలు గత కొద్ది రోజుల నుంచి నిరసన చేపడుతున్నారు. దీనిపై అధికారులు ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో మహిళలు నిరసన కొనసాగిస్తున్నారు.

నేడు విద్యుత్ నిలుపుదల

మక్కువ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మావుడి సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఆర్‌డీఎస్ఎస్ పనులు నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శంబర, ఎస్.పెద్దవలస గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ కె.గోపాలరావునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నాలుగు గంటల నుంచి 10 గంటల వరకు త్రీఫేజ్ సప్లయి ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజలపై భారం తగదు

- ప్రజా సంఘాలు, వామపక్షాల బైకు ర్యాలీ
- 26న కేంద్ర వ్యతిరేక విధానాలపై ధర్నా

పాలకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలను తొలగించాలని ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొండాపురం నుంచి చేపట్టిన బైకు ర్యాలీని పాలకొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వల్లూరు సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు బుడితి అప్పలనాయుడు, బంటు దాసు, శ్రీనునాయుడు, మన్మథరావు, దావాల రమణారావు, నరసింహమూర్తి మాట్లాడారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ర్యాలీలో ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు పాల్గొన్నారు. ● బొబ్బిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈనెల 26న బొబ్బిలి పట్టణంలో ఎన్టీఆర్ సెంటరు నుంచి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకర రావు తెలిపారు. ఈ మేరకు పట్టణంలో ఆదివారం ఆటో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ 26న నిర్వహించనున్న ప్రదర్శనలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకుడు ఎం.శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు మువ్వల శ్రీనివాసరావు, ఎస్.గోపాల్, వి.లక్ష్మునాయుడు పాల్గొన్నారు. ● రామభద్రపురం: ఈనెల 26న బొబ్బిలిలో చేపట్టనున్న ఆటో ప్రచారాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు కోరారు. ఆదివారం సీఐటీయూ మండల కార్యదర్శి బలస శ్రీను ఆధ్వర్యంలో రామభద్రపురంలో సమావేశం నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పాలకొండ: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం,



బొబ్బిలి: నినాదాలు చేస్తున్న నాయకులు

మహిళల రక్షణే లక్ష్యం

- ఏఎస్పీ అంకిత సురానా



బెలగాం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఏఎస్పీ అంకిత సురానా తెలిపారు. నేడు మహిళలపై హింస నిర్మూలనా దినం సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. మహిళకు రక్షణకు తీసుకుంటున్న చర్యలు, చట్టాలు, యాప్‌లపై ఏఎస్పీ ఏమన్నారో ఇప్పుడు తెలుసుకుందాం..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రశ్న: మహిళల రక్షణకు ఎటువంటి చట్టాలు ఉన్నాయి?

జవాబు: మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయి. వరకట్న నిషేధిత చట్టం, గృహ హింస రక్షణ , పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిషేధిత చట్టాలు, జాతీయ మహిళా కమిషన్, అక్రమ రవాణా నిరోధక చట్టం, మహిళా న్యాయస్థానాలు, నిర్భయ వంటి చట్టాలు అమలులో ఉన్నాయి. మహిళా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. ఎవరికి ఏ విధమైన సమస్య వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించొచ్చు.

ప్ర: క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలేంటి?

జ: మహిళల రక్షణ చర్యల్లో భాగంగా గ్రామాల్లో, పాఠశాలు, కళాశాలలో మహిళా పోలీసుల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి బాలికలకు తెలియజేస్తున్నాం. శారీరకంగా, మానసికంగా మహిళలు హింసకు గురైతే... ఆమె తరఫున ఎవరు సమాచారం ఇచ్చినా.. గృహ హింస రక్షణ చట్టం కింద కేసు నమోదు చేస్తాం. 18 ఏళ్లలోపు బాలికలపై లైంగిక దాడులు చేస్తే పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు తప్పవు.

ప్ర: ప్రత్యేక యాప్‌లు ఎలా పనిచేస్తాయి?

జ: మహిళల రక్షణకు ఎస్ఓఎస్ అనే ప్రత్యేక యాప్ రూపొందించాం. దీనిని మహిళందరూ తమ సెల్‌లక్ష డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపదలో ఉన్నప్పుడు ఈ యాప్ ఓపెన్ చేసి బటన్ నొక్కితే చాలు క్షణాల్లో పోలీసులు అక్కడకు చేరుకుని రక్షణ కల్పిస్తారు. సామాజిక మాధ్యమాల వినియోగం విషయంలో మోసాల బారిన పడకుండా మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పార్వతీపురంలో సబ్ డివిజన్‌లో 5 పోక్సో కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం రెండు కేసులు దర్యాప్తు చేస్తున్నాం. మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తాం.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటారు

- జాతీయ స్థాయికి ఎంపికైన పారాది విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బొబ్బిలి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22, 23, 24 తేదీల్లో చిత్తూరులో జరిగిన అండర్-14 సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పారాది జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు (జిల్లా జట్టు) ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఇందులో ఆరుగురు క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరు డిసెంబరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన వారిలో తెర్లాంకు చెందిన సీహెచ్ గౌతమ్, పారాది పాఠశాలలకు చెందిన మణికంఠ, పవన్, కె.ఇందు, ఎస్.జయశ్రీ, అవంతిక ఉన్నారు. ఈ క్రీడాకరులకు పారాది పీడీ నల్ల వెంకటనాయుడు, హెచ్ఎం నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

జిల్లాలో డీఎస్‌డబ్ల్యూవో ఏర్పాటు చేయాలి

పాలకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్‌డబ్ల్యూవో ఏర్పాటు చేయాలని మాజీ సైనికులు కోరారు. ఈ మేరకు వారు ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. భామిని, సీతంపేట, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో సుమారు 120 మంది మాజీ సైనికులు, వీరనారీ మణులు ఉన్నారని, వీరంతా శ్రీకాకుళం జిల్లా డీఎస్‌డబ్ల్యూవోనే రిజిస్ట్రేషన్ చేశారన్నారు. జిల్లాల విభజన అనంతరం నాలుగు మండలాలను పార్వతీపురం మన్యం జిల్లాలో కలిపారని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో డీఎస్‌డబ్ల్యూవో ఏర్పాటు కాలేదన్నారు. మాజీ సైనికుల వెల్ఫేర్ నిమిత్తం డీఎస్‌డబ్ల్యూవో విజయనగరం వెళ్లమని శ్రీకాకుళం డీఎస్‌డబ్ల్యూవో వారు చెబుతున్నారని వాపోయారు. అరకొర పింఛన్‌తో మాజీ సైనికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే జిల్లాలో డీఎస్‌డబ్ల్యూవో ఏర్పాటు చేయాలని వారు కోరారు. మాజీ సైనికులు డి.పాపినాయుడు, ప్రసన్న కుమార్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

సీతంపేట రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏజేఏసీ నాయకుడు బి.ఉమామహేశ్వరరావు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆదివారం దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. గత ఐదు రోజులుగా స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రధాన గేటు వద్ద శాంతియుత నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులకు యూటీఎఫ్ మండల అధ్యక్షులు పకీరు, ఆనందరావు, భాషా, జనసేన మండల నాయకుడు కె.నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు.

తెలుగు నేలను దేవ భూమిగా ప్రకటించాలి

బొబ్బిలి నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మన తెలుగు నేలను దేవభూమిగా ప్రకటించాలని భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి స్వామి డిమాండ్ చేశారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెంట స్వామినాయుడు ఆధ్వర్యంలో స్వామీజీ ప్రవచనాల మూడు రోజుల కార్యక్రమం ఆదివారం రాత్రి ప్రారంభమయ్యింది. తొలి రోజు స్వామీజీ మాట్లాడుతూ భక్తులకు ఆసక్తిదాయకమైన అంశాలను వివరించారు. ● బొబ్బిలి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పక్కి గ్రామంలో సమరసతసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భువనేశ్వరీ పీఠాధిపతి కమలానందభారతి ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

త్రినాథస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పాచిపెంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాచిపెంటలోని త్రినాథస్వామి ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి ఎక్కువయ్యింది. వేకువ జాము నుంచే భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. రాత్రి లక్ష దీపారాధన నిర్వహించారు.



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మద్యం సీసాల స్వాధీనం

బొబ్బిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చింతాడ గ్రామానికి చెందిన చింతాడ తిరుపతిరావును 20 మద్యం సీసాలతో పట్టుకుని, కేసు నమోదు చేశామని ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు. ఆదివారం ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ మేరకు స్థానిక సబ్‌జైలుకు తరలించారని చెప్పారు.

బెల్లం ఊటలు ధ్వంసం

సాలూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేరేళ్లవలస సమీపంలో సారా తయారీ కేంద్రంపై ఆదివారం దాడి చేసినట్టు సాలూరు రూరల్ ఎస్ఐ పి.నర్సింహమూర్తి తెలిపారు. ఈ దాడిలో సారా తయారీకి నిల్వ ఉంచిన 1400 లీటర్ల బెల్లంఊటలను ధ్వంసం చేశామని చెప్పారు. ఆ స్థలం వద్ద పది లీటర్ల సారాతో డి.చిన్నయ్య నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

గరుగుబిల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహదారుల అభివృద్ధికి డిప్యూటీ సీఎం కె.పవన్‌కళ్యాణ్ సుముఖత వ్యక్తం చేశారని రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల పరిధిలోని 12 బీటీ రహదారులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారని తెలిపారు. ఎమ్మెల్యే జగదీశ్వరి సిఫారసు మేరకు రహదారులకు మోక్షం కలగనుందని చెప్పారు. ఈసందర్భంగా ఆమెను సత్కరించారు. పార్టీ ప్రతినిధులు అంబటి తవిటినాయుడు, రాంబాబు, ముదిలిబాబు విజయవాంకు శం, కోట భరత్‌కుమార్, తురకనాయుడువలస సర్పంచ్ పి.నాగమణి పాల్గొన్నారు.

దేశ రక్షణలో భాగస్వాములవ్వండి



విద్యార్థుల పిరమిడ్ విన్యాసం

పార్వతీపురంటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో ఎన్‌సీసీ విద్యార్థులు భాగస్వాములు కావాలని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్ చలపతిరావు అన్నారు. ఎన్‌సీసీ డే సందర్భంగా ఆదివారం స్థానిక ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయన పతకాన్ని ఆవిష్కరించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులు చేపట్టిన పిరమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎన్‌సీసీ అధికారి గుప్తా, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకుల నియామకం



నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

జియ్యమ్మవలస, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు పంచాయతీలకు క్షేత్ర సహాయకులను నియమించినట్టు ఎంపీపీ బొంగు సురేష్ తెలిపారు. ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతులమీదుగా ఆదివారం వారికి నియామక పత్రాలు అందజేశారు. శిఖబడి పంచాయతీ క్షేత్ర సహాయకుడిగా ఎర్ర తరుణ్‌కుమార్, జియ్యమ్మవలస పంచాయతీ క్షేత్ర సహాయకుడిగా లచ్చిరెడ్డి దినేష్‌కుమార్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, టీడీపీ నాయకులు లంక గోపాలం, దాసరి రామారావు, గుణుపూరు జగన్నాథం, దత్తి వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

బెలగాం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విశాఖలో లా విద్యార్థినిపై లైంగికంగా దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బాలికల వసతిగృహాల్లో మహిళల దాడులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖలో జరిగిన ఘటన సమాజం తలదించుకునేలా ఉందన్నారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువయిందని చెప్పారు. గంజాయి మత్తులో ఎక్కువగా నేరాలు చేస్తున్నారని, గంజాయి నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలని ఆమె హితవు పలికారు. ఈ కార్యక్రమంలలో ఎస్ఎఫ్ఐ నాయకులు పండు, రాజు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.